క్లుప్తంగా

గండ్లవేడు ఆయకట్టుకు సాగునీరు విడుదల



గండ్లవేడు చెరువు నుంచి నీటి విడుదల చేస్తున్న రైతులు

ఆత్మకూరురూరల్: మండలంలోని గండ్లవేడు చెరువు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పూర్తిగా నిండి అలుగులు పారాయి. ఈ నేపథ్యంలోని 400 ఎకరాల ఆయకట్టు ఉన్న రైతులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తూ తమ చెరువు తూము ద్వారా ఆదివారం ఆయకట్టకు నీటిని విడుదల చేశారు. అంతకు ముందు గ్రామంలోని గంగమ్మకు పూజలు నిర్వహించి పంట కాలువకు నీటి విడుదల చేశారు. కార్యక్రమంలో గండ్లవేడు చెరువు ఆయకట్టు రైతులు, వెన్నవాడ సొసైటీ చైర్మన్ శ్రీహరినాయుడు, పార్టీ నేత శ్రీనివాసులునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పర్యాటకులు జాగ్రత్తగా ఉండాలి



కోతులగుండం జలపాతం వద్ద సిబ్బందితో ఎస్సై విశ్వనాథరెడ్డి

మర్రిపాడు: మండలంలోని సింగనపల్లి అటవీ ప్రాంతంలో ఉన్న కోతులగుండం జలపాతానికి వచ్చే పర్యాటకులు జాగ్రత్తగా ఉండాలని ఎస్సై విశ్వనాథరెడ్డి అన్నారు. ఆదివారం తమ సిబ్బందితో కలిసి కోతులగుండం జలపాతాన్ని ఆయన సందర్శించారు. జలపాతాన్ని చూసేందుకు పర్యాటకుల తాకిడితో ముందస్తు చర్యల్లో భాగంగా తమ సిబ్బందితో కలిసి జలపాతాన్ని సందర్శించామన్నారు. పర్యాటకులు జాగ్రత్తలు పాటించాని, జలపాతం వద్ద ఎటువంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా పలు సూచనలు అందజేశారు.

యూటీఎఫ్ మహాసభ స్వర్ణోత్సవాలు



మాట్లాడుతున్న మూలి వెంగయ్య

మర్రిపాడు: స్థానిక యూటీఎఫ్ భవనంలో ఆదివారం మండల మహాసభ స్వర్ణోత్సవాలు నిర్వహించారు. జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు మూలి వెంగయ్య మాట్లాడుతూ విద్యా వ్యవస్థలోని సమస్యలతో పాటు ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం యూటీఎఫ్ ఎంతగానో శ్రమించిందన్నారు.

లారీ బోల్తా.. డ్రైవర్‌కు స్వల్పగాయాలు



బోల్తా పడిన లారీ

మర్రిపాడు: ఆవులు అడ్డం రావడంతో వాటిని తప్పించబోయి లారీ బోల్తా పడింది. ఈ ఘటన ఆదివారం నెల్లూరు–ముంబయి జాతీయ రహదారిపై చుంచులూరు సమీపంలో జరిగింది. కృష్ణపట్నం పోర్టు నుంచి మహారాష్ట్రకు చాక్లెట్ పౌడర్ పదార్థాల లోడుతో వెళ్తున్న లారీ చుంచులూరు సమీపానికి వచ్చేసరికి ప్రమాదానికి గురైంది. ప్రమాదంలో డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డారు.

అనారోగ్యంతో వృద్ధురాలు



సుబ్బమ్మ

ఉదయగిరి: ప్రకాశం జిల్లా కనిగిరిలో సరైన పోషణ లేక కొన్ని రోజులుగా తిరుగుతున్న ఓ వృద్ధురాలి కాలికి ఆదివారం దెబ్బ తగిలిన నేపథ్యంలో స్థానికులు ఆమెను కనిగిరి వైద్యశాలలో చికిత్స నిమిత్తం చేర్పించారు. ఆమెకు మెరుగైన వైద్యం కోసం ఒంగోలుకు తరలించాల్సి ఉంది. తన పేరు సుబ్బమ్మ అని, ఊరు నర్రవాడ చెబుతుందని, ఆమె తరపు బంధువులు ఎవరైనా ఉంటే సంప్రదించాలని ఆస్పత్రి వర్గాలు కోరుతున్నాయి.

పరామర్శ

ఆత్మకూరు: పట్టణానికి చెందిన పార్టీ నేత చింతలపల్లి శ్రీనివాసులురెడ్డి భార్య పద్మావతమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో ఆ కుటుంబ సభ్యులను ఆదివారం ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి పరామర్శించారు. ఆమె మరణానికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆ కుటుంబానికి అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. ఎమ్మెల్యేతో పాటు స్థానిక పార్టీ నేతలు, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

సీఎం జగన్‌తోనే సంక్షేమం సాధ్యం



పట్టణంలోని 7వ వార్డులో గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి

• ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే పేదల సంక్షేమం సాధ్యమని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని 7వ వార్డులో ఆదివారం గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి పథకాలను వివరించారు. సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు అందిన లబ్ధిని వివరించే బుక్‌లెట్‌లు పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత పేదలకు భద్రత, భరోసా లభించాయన్నారు. విద్య, వైద్య, ఉపాధి రంగాలకు పెద్ద పీట వేయడంతో పాటు సంక్షేమ పథకాల ద్వారా పేదలను ఆదుకునేందుకు గ్రామ స్థాయిలో సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు వివరించారు. పార్టీలతో పనిలేకుండా అర్హత కలిగిన ప్రతి నిరుపేద కుటుంబానికి పథకాలు అందించి అండగా నిలిచిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని తెలిపారు. ప్రధానంగా కావలి నియోజకవర్గ అభివృద్ధి సీఎం ప్రత్యేక చొరవ చూపారన్నారు. రామయపట్నం పోర్టు, జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌తో నియోజకవర్గ రూపురేఖలే మారనున్నాయని వివరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సమగ్రాభివృద్ధికి కృషి



ఏడీఎఫ్ ఏర్పాటు చేసి ఏడాది పూర్తయిన సందర్భంగా కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

• ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి



నూతన వధూవరులను అభినందిస్తున్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

ఆత్మకూరు: నియోజకవర్గాన్ని అందరి సహకారంతో సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని పంటవీధిలో కౌన్సిలర్ రాధికారెడ్డి నివాసంలో ఆదివారం ఆయన పలువురితో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఆత్మకూరు అభివృద్ధి కోసం అందరి సలహాలు, సూచనలు తీసుకుంటున్నామని, అదే క్రమంలో ఈ ప్రాంతానికి చెంది ఇతర ప్రాంతాల్లో ఉంటున్న ఆర్థిక స్థితిమంతుల సహాయం ఏడీఎఫ్ ద్వారా సేకరించి సమగ్ర అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఏడీఎఫ్ ద్వారా మున్సిపల్ బస్టాండ్ భవనం, ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ తరగతుల నిర్వహణ, తదితర కార్యక్రమాలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వ నిధులకు తోడు ప్రైవేట్ భాగస్వామ్యంతో నియోజకవర్గాన్ని వివిధ రంగాల్లో అభివృద్ధి చేస్తామన్నారు. సోమశిల జలాశయంలో నీటి లభ్యత తక్కువగా ఉన్న నేపథ్యంలో గత నెలలో డెల్టాకు తొలుత సాగునీరు ఇచ్చినట్లు, మెట్ట ప్రాంతాలకు సోమవారం నుంచి ఉత్తర కాలువ ద్వారా సాగునీరు విడుదల చేయనున్నట్లు ఆయన తెలిపారు.

వధూవరులకు ఆశీర్వాదం

పట్టణంలోని పంట వీధికి చెందిన పార్టీ నాయకుడు అల్లారెడ్డి శ్రీధర్‌రెడ్డి కుమారుడు అఖిల్, స్పందన వివాహం ఇటీవల జరగడంతో నూతన వధూవరులను ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆశీర్వదించారు. అనంతరం స్థానికంగా ఉన్న పలువురు రైతులతో సాగునీటి సరఫరా గురించి, నీటిని పొదుపుగా వాడుకుంటూ పంటలు పండించుకోవాలని సూచనలు చేస్తూ రైతులతో మాట్లాడారు. ఈ కార్యక్రమాల్లో పట్టణ పార్టీ అధ్యక్షుడు అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య, వైస్ చైర్మన్లు డాక్టర్ శ్రావణ్‌కుమార్, సర్దార్, కౌన్సిలర్లు తిరుపతమ్మ, నౌషద్‌బేగం, ఎం రాజశేఖర్, శివకోటారెడ్డి, పార్టీ నాయకులు నాగులపాటి ప్రతాప్‌రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, నోటి వినయ్‌కుమార్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ పి రవీంద్రారెడ్డి, సయ్యద్ జమీర్, రహీం, కొండా వెంకటేశ్వర్లు, కలాం, కిషోర్ రెడ్డి, కొప్పోలు వెంకటేశ్వర్లు, మణి, పలువురు వలంటీర్లు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే మేకపాటి పర్యటన

సోమశిల: ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డి సోమవారం సోమశిలలో పర్యటించనున్నారని మండల సచివాలయ కన్వీనర్ అక్కల రెడ్డి అంకిరెడ్డి ఆదివారం తెలిపారు. కామాక్షి సమేత సోమేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారన్నారు.

'జయహో జగన్' పాదయాత్రకు స్వాగతం



కావలిలో ఎమ్మెల్సీ రఘురాజుతో కలిసి జయహో జగన్ పాదయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి

కావలి: విజయనగరం జిల్లాకు చెందిన ఎమ్మెల్సీ ఇందుకూరు రఘురాజు దంపతులు ఆంధ్ర రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలనే సంకల్పంతో విజయనగరం నుంచి తిరుమల వరకు చేపట్టిన జయహో జగన్ పాదయాత్ర ఆదివారం కావలికి చేరుకుంది. 820 కి.మీ. మేర 43 రోజుల పాటు సాగనున్న పాదయాత్రకు కావలిలో స్థానిక జెండాచెట్టు దర్గా వద్ద కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, ముస్లింలు, పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు. ముస్లిం మతపెద్దలు దువా నిర్వహించిన అనంతరం పాదయాత్రగా ఎమ్మెల్సీ ఇందుకూరు రఘురాజు పట్టణంలోని ఎమ్మెల్యే నివాసానికి చేరుకున్నారు. ఇందుకూరు రఘురాజు మాట్లాడుతూ సీఎం జగన్ పాలనలో అన్నీ వర్గాల ప్రజలు సుఖ సంతోషాలతో ఉన్నారని తెలిపారు. అందరూ అధికారం కోసం రాజకీయాల్లోకి వస్తుంటే జగన్‌మోహన్ రెడ్డి మాత్రం సేవ కోసం రాజకీయాల్లోకి వచ్చారని తెలిపారు. మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా కావాలని రాష్ట్రమంతా కోరుకుంటుందని తెలిపారు. ఎమ్మెల్యే ప్రతాప్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ 820 కి.మీ. మేర పాదయాత్ర చేస్తున్న ఎమ్మెల్సీ రఘురాజును, ఆయన బృందాన్ని అభినందించారు. వైఎస్ జగన్ అందిస్తున్న పాలన దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని వివరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ఉదయగిరి: ఉదయగిరి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని రెండు అంగన్‌వాడీ కార్యకర్తలు, మూడు అంగన్‌వాడీ హెల్పర్ల పోస్టులకు ఖాళీల భర్తీకి అధికారులు నోటిఫికేషన్ జారీ చేశారు. సీడీపీఓ పి.లావణ్య మాట్లాడుతూ ఉదయగిరి మండలం గుడినరవ, సీతారామపురం మండలం గంధంవారిపల్లిలో ఖాళీగా ఉన్న పోస్టులకు జనరల్ కేటగిరీకి కేటాయించినట్లు తెలిపారు. హెల్పర్లకు సంబంధించి సీతారామపురం మండలం బసినేనిపల్లి మెయిన్ (జనరల్), ఉదయగిరి మండలం జి.చెర్లోపల్లి (బీసీ–డీ), ఉదయగిరి దళితవాడ (జనరల్) కేటాయించినట్లు ఆమె చెప్పారు. ఈ నెల 19వ తేదీ లోపు ఆసక్తి ఆయా అంగన్‌వాడీ పరిధిలోని సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు ఆ మండలాల అంగన్‌వాడీ సూపర్‌వైజర్ లేదా సచివాలయ సిబ్బందిని సంప్రదించాలని ఆమె చెప్పారు.

రెండు హెల్పర్ పోస్టులకు..

అల్లూరు: మండలంలో ఖాళీగా ఉన్న రెండు అంగన్‌వాడీ హెల్పర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని సూపర్‌వైజర్ రాజేశ్వరి తెలియజేశారు. ఇస్కపల్లి జవ్వాగులక్ష్మీపురం ఎస్సీ–1, ఇస్కపల్లి పట్టపుపాళెం జనరల్–1 ఖాళీలు ఉన్నాయని, అర్హత ఉన్న వారు ఈ నెల 9 నుంచి 19వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

అనంతసాగరంలో..

సోమశిల: ఐసీడీఎస్ అనంతసాగరం ప్రాజెక్ట్ పరిధిలోని అంగన్‌వాడీ సహాయకుల ఖాళీల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీఓ పద్మావతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని చిలకలమర్రి బీసీ–డీ, అనంతసాగరం జనరల్ సహాయకుల ఖాళీగా ఉన్నాయని ఆమె వివరించారు. ఈ నెల 19వ తేదీ లోపు సచివాలయాల్లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

వైభవంగా పోలేరమ్మ జాతర



కలిశాలతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు

సంగం: మండలంలోని సిద్ధిపురం దళితవాడలో ఆదివారం పోలేరమ్మ జాతర వైభవంగా నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో కలిశాలతో పవిత్ర జలాలను ఊరేగింపుగా తీసుకువచ్చి అమ్మవారికి అభిషేకాలు నిర్వహించారు.

అయ్యప్పల శబరిమల యాత్ర



ఇరుముడులు కట్టుకున్న అయ్యప్పమాలధారులు

సంగం: అయ్యప్పస్వాముల శబరిమల యాత్ర ఆదివారం శోభాయమానంగా సాగింది. స్థానిక శివాలయ ఆవరణలో ఉన్న అయ్యప్పస్వామి ఆలయంలో ప్రత్యేక హోమాలు నిర్వహించి భక్తిశ్రద్ధలతో గురుస్వామితో ఇరుముడి కట్టించుకున్నారు. శివాలయం నుంచి ఆంజనేయస్వామి గుడి వరకు స్వామియే శరణమయ్యప్ప అంటూ శరణఘోషతో ఊరేగింపుగా వచ్చి ప్రత్యేక వాహనంలో బయలుదేరి శబరిమలైకు వెళ్లారు.

అందరికీ సమాన హక్కులు



ఆర్టీసీ గ్యారేజ్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ఆత్మకూరు సీనియర్ సివిల్ జడ్జి బి రాజేష్

ఆత్మకూరురూరల్: ఐక్యరాజ్య సమితి ఆదేశాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరికి ప్రాథమిక హక్కులు, స్వేచ్ఛా సమానత్వం సమంగా సంక్రమించిందని ఈ విషయంలో అవగాహన పెంచుకోవాలని ఆత్మకూరు సీనియర్ సివిల్ జడ్జి బి రాజేష్ అన్నారు. అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా ఆత్మకూరు ఆర్టీసీ డిపో గ్యారేజ్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వేచ్ఛ అనేది సత్ప్రవర్తన కలిగిన ప్రతి ఒక్కరికి వర్తిస్తుందని, నేరాలు చేసి జైల్లో ఉన్న వారికి ఈ అవకాశం ఉండదన్నారు. గతంలో మహిళలు, పురుషులకు వేతనంలో వ్యత్యాసం ఉండేదని, ప్రస్తుతం చేసే పనిని బట్టి అందరికి సమానంగా ఈ హక్కు సంక్రమించిందన్నారు. నిజమైన సమస్యలు ఉన్న వారు పైసా ఖర్చు లేకుండానే తెల్ల పేపరుపై సమస్యను రాసి కోర్టుకు సమర్పిస్తే వారి తరఫున ప్రభుత్వం నియమించిన లాయర్లే వాదించి న్యాయం చేస్తారన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ సీఐ కల్పనారెడ్డి, గ్యారేజీ ఇన్‌చార్జి శ్రీనివాసులు, యూనియన్ల నాయకులు విజయ్‌కుమార్, గౌస్ అహమ్మద్, సీనియర్ న్యాయవాది ఎల్‌వీ రమణయ్య పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేతలు సమష్టితో పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు

ఉదయగిరి: మండలంలో వైఎస్సార్‌సీపీ ప్రతి కార్యకర్త సమష్టి కృషి చేయాల్సిన అవసరం ఉందని మండల అధ్యక్షుడు జి.ఓబుల్‌రెడ్డి అన్నారు. ఉదయగిరిలోని మాజీ ఎంపీపీ చేజర్ల సుబ్బారెడ్డి నివాసంలో ఆదివారం సుబ్బారెడ్డితో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలోని అభివృద్ధి, సంక్షేమం మన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్నారన్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా రూ.25 లక్షల వరకు ఉచితంగా కార్పొరేట్ వైద్యం అందించే కార్యక్రమాన్ని త్వరలో ప్రారంభించనున్నట్లు చెప్పారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిని గెలిపించుకోవాల్సిన అవసరముందన్నారు. నేతలు, కార్యకర్తల మధ్య చిన్న చిన్న అభిప్రాయ బేదాలున్నప్పటికీ వాటిని పరిష్కరించుకొని పార్టీని బలోపేతం చేసి వచ్చే ఎన్నికల్లో మండలంలో అధిక మెజారిటీ సాధించేందుకు కృషి చేయాలన్నారు. సోమవారం ఉదయగిరి సచివాలయం–3 పరిధిలో వై ఏపీ నీడ్స్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దాసరపల్లి సర్పంచ్ సయ్యద్ గౌస్‌మొహిద్దీన్, మాజీ ఎంపీపీ నేలటూరి అబ్రహం, మాజీ మండల ఉపాధ్యక్షుడు బాలిబోయిన శ్రీనివాసులు, నేతలు ఉప్పుటూరి హరి, వాకా సుబ్బారెడ్డి, రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విశ్వంలో మూలకాలే కీలకం



ఉదయగిరి: విశ్వంలో మూలకాలే కీలకమని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు జి.సుధాకర్‌రెడ్డి చెప్పారు. పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా విశ్వంలో మూలకాలు, అవి నిర్వర్తిస్తున్న వివిధ అంశాలపై క్షుణ్ణంగా ఆదివారం స్థానిక షాదీమంజిల్ హాల్లో సెమినార్ నిర్వహించారు. సైన్సు, బయోలజీ, ఫిజిక్స్, సోషల్, కెమిస్ట్రీ అంశాల్లో మిళితం చేసి పవర్‌పవర్ ప్రజంటేషన్ ద్వారా ప్రతి అంశాన్ని అర్థమయ్యేలా తెలియజేశారు. ఈ సెమినార్‌లో జేవీవీ నాయకులు దస్తగిరి అహ్మద్, కె.శ్రీనివాసులు, ఎంపీ నారసింహారెడ్డి, జి.రామిరెడ్డి, పి.చక్రపాణి, డాక్టర్ రాజా వెంగళరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నాన్‌డెల్టాకు సాగు నీరివ్వాలి

ఆత్మకూరు: సోమశిల జలాశయం నుంచి మెట్ట ప్రాంతాలైన నాన్‌డెల్టాకు సాగునీరు విడుదల చేయాలని ఏపీ రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, కౌలు రైతుల సంఘం నాయకులు కోరారు. పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో ఆ సంఘాల నాయకులు విలేకర్లతో మాట్లాడుతూ జలాశయానికి 36 టీఎంసీల నీరు చేరిందని ఉత్తర, దక్షిణ కాలువలకు, కావలి, కనుపూరు కాలువలకు సాగునీరు వెంటనే విడుదల చేయాలని రైతులు ఎదురు చూస్తున్నారన్నారు. రైతు సంఘాల నాయకులు పి శ్రీరాములు, మూలి వెంగయ్య, ఎం పుల్లయ్య, నెల్లూరు నగర మాజీ డిప్యూటీ మేయర్ మాదాల వెంకటేశ్వర్లు, ఎస్‌కే అన్వర్ బాషా, రహంతుల్లా తదితరులు పాల్గొన్నారు.



తుఫాన్ బాధితులకు సామగ్రి పంపిణీ

కావలి: పట్టణంలోని కావేరిగుంట గిరిజన కాలనీలో తుఫాన్ కారణంగా నష్టపోయిన పది గిరిజన కుటుంబాలకు కావలి రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ఆదివారం తక్షణ సహాయ సామగ్రి పంపిణీ చేశారు. రెడ్‌క్రాస్ సెర్వ్ బృందం, టీం సేవియర్స్ సభ్యులు వర్షాలకు దెబ్బతిన్న పూరిగుడిసెలకు టార్పాలిన్ పట్టలు కప్పి రిలీఫ్ కిట్లు అందజేశారు. కావలి రెడ్‌క్రాస్ చైర్మన్ డీ రవిప్రకాష్ మాట్లాడుతూ తుఫాన్ బాధిత గిరిజన కుటుంబాలకు సహాయపడుతున్నామన్నారు. రెండు, మూడు రోజుల్లో మిగిలిన గిరిజన కాలనీలకు కూడా కిట్లు అందజేయనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ ప్రతినిధులు గంధం ప్రసన్నాంజనేయులు, హరినారపరెడ్డి, స్వర్ణలత, ప్రసాద్, టీం సేవియర్స్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

పతకాల పద్మావతి



కావలి: 42వ రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీలతో సత్తా చాటిన పద్మావతి

కావలి: తిరుపతిలో ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకు నిర్వహించిన 42వ రాష్ట్ర స్థాయి మాస్టర్ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో కావలికి చెందిన వెటరన్ క్రీడాకారిణి దాకారపు పద్మావతి సత్తాచాటారు. 50 ఏళ్ల విభాగం పోటీల్లో పాల్గొన్న పద్మావతి హామర్‌త్రో, డిస్కస్‌త్రో పోటీల్లో రెండు బంగారు పతకాలు, ట్రిపుల్‌జంప్‌లో వెండి పతకం సాధించారు. ఈ సందర్భంగా పద్మావతి మాట్లాడుతూ తనకు శిక్షణనిచ్చిన విశ్రాంత వ్యాయామ అధ్యాపకురాలు కోటేశ్వరమ్మకు, ప్రోత్సహించిన రెడ్‌క్రాస్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

సీసీరోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న నాయకులు కంటాబత్తిన రఘునాథ్‌రెడ్డి

సంగం: సంగం మెయిన్ బజార్ నుంచి పలు వీధులను అనుసంధానం చేస్తూ నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనులను పార్టీ మాజీ కన్వీనర్ కంటాబత్తిన రఘునాథ్‌రెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి వచ్చిన ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డికి సంగం బిట్–1 సచివాలయం పరిధిలో రోడ్డు సమస్య ఉందని స్థానికులు తమ దృష్టికి తీసుకొచ్చారని, రోడ్డు మంజూరు చేయాలని విన్నవించడంతో రూ.10 లక్షలు, జెడ్పీ నిధుల ద్వారా రూ.10 లక్షలు మొత్తం రూ.20 లక్షలు మంజూరు చేయించారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రావుల ప్రసాద్‌గౌడ్, శివ, రవీంద్రబాబు, జనార్దన్, కరుణాకర్, శివ, జహంగీర్, మధు, వేణు, కుమార్ తదితరులు ఉన్నారు.

మళ్లీ జగనే సీఎం కావాలి

• ఇడుపులపాయకు పార్టీ నాయకులు



ఇడుపులపాయలో వైఎస్సార్ సమాధిని సందర్శించిన ఆత్మకూరు నాయకులు

ఆత్మకూరు: సంక్షేమాల సారథి, అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రానున్న ఎన్నికల్లోనూ ప్రజల మద్దతుతో భారీ మెజార్టీతో గెలుపు సాధించి మళ్లీ సీఎం కావాలని కోరుతూ పట్టణానికి చెందిన పలువురు వైఎస్సార్ జిల్లా ఇడుపులపాయను ఆదివారం సందర్శించారు. మున్సిపల్ వైస్ చైర్మన్లు డాక్టర్ కేవీ శ్రావణ్‌కుమార్, షేక్ సర్దార్, మున్సిపల్ వార్డు కౌన్సిలర్లు సయ్యద్ నౌషాద్‌బేగం, కొప్పోలు రమాదేవి, కామాక్షయ్యనాయుడు, శివకోటారెడ్డి, టి తిరుపతమ్మ, గంధళ్ల వేణు తదితరులు ప్రత్యేక వాహనంలో తరలి వెళ్లారు. ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డే ఎన్నిక కావాలని మొక్కుకుని మహానేత వైఎస్సార్ సమాధిని సందర్శించినట్లు తెలి పారు. ఈ కార్యక్రమంలో నాయకులు సయ్యద్ జమీర్, ముజీబ్, కొప్పోలు చిన్నపరెడ్డి, టి వెంకటేశ్వర్లు, చైతన్య, గంగాధర్ పాల్గొన్నారు.

బియ్యం, నిత్యావసర సరుకుల పంపిణీ

కావలి: పట్టణం వెంగళరావునగర్‌లోని డాక్టర్ డీఆర్ విశ్వోదయ సేవాసమితి కార్యాలయంలో 60 మంది నిరుపేదలకు బియ్యం, నిత్యావసర సరుకులను ఆదివారం పంపిణీ చేశారు. పాతూరు రాజీవ్‌నగర్ పీహెచ్‌సీ వైద్యులు మేఘనాథ్‌చౌదరి మాట్లాడుతూ కావలికి విద్యాదాతగా నిలిచిన డాక్టర్ డీఆర్ పేరు మీద విస్తృతంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న వినయ్‌కుమార్‌రెడ్డి, విద్యాధర కుమార్ రెడ్డిలను అభినందించారు. కార్యక్రమంలో విశ్వోదయ రెక్టార్ వినయ్‌కుమార్ రెడ్డి, డీఆర్ విశ్వోదయ సేవాసమితి చైర్‌పర్సన్ దొడ్ల ఆదిలక్ష్మి, డైరెక్టర్ కూనం తాతిరెడ్డి, సభ్యులు నల్లూరు రామకృష్ణ, సతీష్ సింగ్, జేబీ కళాశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.